క్లుప్తంగా

నకిలీ మద్యం తయారీపై వైఎస్సార్‌సీపీ నిరసన నేడు

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారీ, బెల్ట్ షాపుల నిర్వహణపై నిరసన తెలుపుతూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఆందోళన చేపట్టనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నాయుడుతోటలోని పెందుర్తి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

దుర్గానగర్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద..

పరవాడ: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో 93వ వార్డు చాకలి గెడ్డ దుర్గానగర్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద నకిలీ మద్యంపై సోమవారం ఉదయం 9.30 గంటలకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పార్టీ పరవాడ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముత్యాలనాయుడు

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవ శివారు ఇందిరానగర్ కాలనీలో రూ.10.14 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ మొల్లి ముత్యాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వార్డు ప్రధాన కార్యదర్శి ఉరుకూటి శ్రీను, మాజీ ఉప సర్పంచ్ మామిడి నర్సింగరావు, వార్డు కార్యనిర్వాహక కార్యదర్శి నక్క ప్రసాద్, గండికోట వెంకీ, సర్వసిద్ధి రాజు, ఉరుకూటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరహా లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, స్వామివారి ప్రసాదం అందజేశారు.

మేహాద్రిలో ఈత ప్రమాదకరం



మేహాద్రి వద్ద సందర్శకులను హెచ్చరిస్తున్న పోలీసులు

పెందుర్తి: నిండు కుండను తలపిస్తున్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత ప్రమాదకమరని సీఐ కేవీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మేహాద్రికి సందర్శకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో సమాచారం అందుకున్న సీఐ సతీష్‌కుమార్ పోలీస్ సిబ్బందిని అక్కడకు పంపి కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలను సిబ్బంది సందర్శకులకు వివరించారు. ఇక్కడ ఈత చేయరాదని, వారాంతంలో ఇక్కడకు వచ్చే వారంతా మేహాద్రి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి తరించాలి తప్ప ఈతకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- పట్టణం, గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- కూటమి నాయకుల కనుసన్నల్లో సాగుతున్న వ్యాపారం
- గ్రామాల్లో యథేచ్ఛగా రూ.లక్షల్లో వేలంపాటలు
- నేరుగా లైసెన్స్ దుకాణాల నుంచే సరఫరా
- కన్నెత్తి చూడని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు



వీధికో.. బెల్ట్ షాప్..!

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అనధికారిక కుటీర పరిశ్రమగా ఎంచుకున్న మద్యం జనావాసాల్లో ఏరులై పారుతోంది. పట్టణం, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు వెలిశాయి. సమయం సందర్భం లేకుండా నిరంతరం మందుబాబులకు కిక్ ఇస్తోంది కూటమి ప్రభుత్వం. ఎన్నికల సమయంలో తెలుగుదేశం–జనసేన పార్టీల కూటమి బెల్ట్ దుకాణాలను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రచారంలో హోరెత్తించింది. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఆ హామీని 'మద్యం'లో కలిపేసింది.



పెందుర్తి పట్టణంలోని ఓ బెల్ట్ షాపులో పట్టుబడిన మద్యం(ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ హయంలోని ప్రభుత్వ మద్యం పాలసీని రద్దు చేసి ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కట్టబెట్టింది. ఇప్పుడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. అవి రోజు రోజుకూ పెరుగుతున్నాయి. స్వయంగా కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఆయా దుకాణాలు వెలుస్తున్నాయి.



ఇటీవల పోలీసుల కార్డెన్ సెర్చ్‌లో వేపగుంట బంటా కాలనీలో బెల్ట్ షాపులో పట్టుకున్న మద్యం

కూటమి నాయకుల ఇష్టారాజ్యం..

మద్యం దుకాణాల నిర్వహణ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాక బెల్ట్ షాపులకు మార్గం సుగమమైంది. లైసెన్స్ దుకాణాలు దాదాపు 95 శాతం కూటమి నాయకుల చేతిలోనే ఉండటంతో బెల్ట్ షాపులకు మద్యం సరఫరా.. అమ్మకాలకు ఇబ్బంది లేకుండా పోయింది. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి యథేచ్ఛగా బెల్ట్‌ను ప్రోత్సహిస్తున్నారు. దుకాణాల్లో మద్యం అమ్మకాలు పెరగాలంటే బెల్ట్ దుకాణాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నది వారి వ్యాపార సూత్రం. ఫలితంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. 24 గంటలకు మందుబాబులకు మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్నాయి. చివరకు బెల్ట్ షాపుల వద్ద గొడవలు చినికిచినికి గాలివానగా మారి హత్యాయత్నాలకు దారి తీస్తున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరుతున్నారు.

ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి..

నియోజకవర్గ కేంద్రం పెందుర్తి, గ్రామీణ ప్రాంతం సబ్బవరం, పారిశ్రామిక ప్రాంతం పరవాడలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. దాదాపు ప్రతి గ్రామంలోనూ రెండు మూడు మద్యం బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే క్రమంలో ప్రధాన దుకాణదారులే బెల్ట్ షాపులకు స్వయంగా మద్యం సరఫరా చేయడం గమనార్హం. ఇందుకోసం నేరుగా దుకాణదారులే రంగంలోకి దిగి గ్రామాల్లో వేలంపాటల ద్వారా బెల్ట్ షాపులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. నియోజకవర్గంలో ఈ తరహా బెల్ట్ వ్యాపారం సిండికేట్ ప్రధాన దుకాణాలకు అంతర్గతంగా జరుగుతుండటం గమనార్హం. పరవాడలో ఏకంగా నకిలీ మద్యం తయారు చేస్తున్న డెన్‌లు బయటపడటం ఆందోళన కలిగించే అంశం. బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మండలాల వారీగా బెల్ట్ షాపులు

పెందుర్తి గ్రామీణ ప్రాంతం	పెందుర్తి పట్టణ ప్రాంతం	పరవాడ	సబ్బవరం
పంచాయతీలు 15, గ్రామాలు 33, బెల్ట్ దుకాణాల సంఖ్య: దాదాపు 80	దాదాపు 250 బెల్ట్ షాపులు	14 పంచాయతీలు, 35 గ్రామాలు, బెల్ట్ షాపులు దాదాపు 60	పంచాయతీలు 24, గ్రామాలు 60, బెల్ట్ షాపుల సంఖ్య దాదాపు 120

మా పరిధి వరకు నియంత్రిస్తున్నాం



లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల్లో మాత్రమే నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలి. బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్ట్ షాపులపై దాడులు విస్తృతంగా చేస్తున్నాం. వీటి గురించి ప్రజలు సమాచారమిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. కార్డెన్ సెర్చ్‌లో కూడా ఆయా దుకాణాలపై దృష్టి సారిస్తున్నాం. ఇటీవల చాలా వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశాం.

–కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి లా అండ్ ఆర్డర్



మూడు రోజుల కిందట పెందుర్తి పోలీసులు బెల్ట్ షాపులో పట్టుకున్న మద్యం

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్, దంతులూరి దిలీప్‌కుమార్, శరగడం, గండి రవి

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో పేదలకు వైద్యం అందడం కలగానే మిగిలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆక్షేపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మంజూరైన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజా ఉద్యమం ద్వారా తిప్పికొడతామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. రాంపురంలోని పార్టీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అదీప్‌రాజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులు, ప్రజల కోసం తీసుకొచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఏకమై ప్రైటుపరం చేయాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రజా పాలన గాలికి వదిలేసి ప్రైవేటు మంత్రం జపిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వం మంచి మార్గంలో నడిచి ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్ఈసీ సభ్యుడు శరగడం చిన అప్పలనాయుడు, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకుడు దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, సీనియర్ నేతలు గండి రవికుమార్, ఉప్పిలి కనకరాజు, మదుపాడ అంజి, కొటాన రాము, బోకం రామునాయుడు, కోన రామారావు, రాపర్తి మాధవరావు, గంఽడ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, యతిరాజుల నాగేశ్వరరావు, గొరపల్లి శ్రీను, చొప్ప నాగరాజు, తామర్ల నర్సింగ్, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, దాడి ఉమామహేశ్వర రావు, మోపాడ చందు, బోరయ్య, యద్ద నాయుడు, సిరపరపు వాసు, మహేష్, గోవింద్‌పట్నాయక్, కావాలి వాసు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వెంకటాద్రిపై ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. ముందుగా భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

నేడు అర్జీల స్వీకరణ



పరవాడ తహసీల్దార్ నాగరాజు

పరవాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్జీదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

తీరం.. ఘోరం..!

- చెత్తాచెదారంతో నిండిపోయిన ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతం
- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు



ముత్యాలమ్మపాలెం సాగర తీరంలో చెత్తాచెదారం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం చెత్తాచెదారంతో నిండిపోయి ఘోరంగా తయారైంది. అధ్వానంగా మారిన తీర ప్రాంతాన్ని పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. సముద్రం లోపలి నుంచి అలల ద్వారా కొట్టుకొచ్చిన అనేక రకాల వ్యర్థాలు తీరంలో చేరి పేరుకుపోయాయి. తీరం అందాలను తిలకిస్తూ సరదాగా కాసేపు గడిపేందుకు ఇక్కడికి వస్తున్న సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరం వెంబడి ఎక్కడికక్కడ గాజు పెంకులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం దర్శనమివ్వడంతో కాలు మోపాలంటేనే భయపడుతున్నారు. ఆకతాయిలు వెంట తెచ్చుకున్న బీరు సీసాలు తాగి తీరంలో పగుల గొట్టడం వల్లఇసుకలో పెంకులు కూరుకుపోతున్నాయి. వీటి వల్ల పలువురు సందర్శకులు గాయాలపాలవుతున్నారు. గ్రామంలో మరణించిన వారికి తీరంలో దహన సంస్కారాలు పూర్తి చేసిన తరువాత కాలిన కర్రలు, బూడిదను అక్కడే వదిలిపెట్టడడం వల్ల సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తీరంలోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోళ్లఫారంతో తీవ్ర ఇబ్బందులు

- వ్యర్థాల కారణంగా అనారోగ్యం పాలవుతున్నాం
- తక్షణమే తొలగించాలని దువ్వపాలెం వాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న దువ్వపాలెం వాసులు

పెందుర్తి: 'మా గ్రామం నడిబొడ్డున కోళ్ల ఫారం ఉంది. ఫారం నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, దుర్వాసన కారణంగా తీవ్రమైన రోగాలు వస్తున్నాయి. ఆహారం కూడా సహించడం లేదు. గ్రామానికి నడిబొడ్డున ఉన్న ఫారాన్ని తొలగించాలని చాలా కాలంగా ఆందోళన చేస్తున్నాం. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు' అంటూ పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ పంచాయతీ దువ్వపాలెం వాసులు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామంలో పార్టీలకు అతీతంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ జనావాసాల మధ్య ఉన్న కోళ్ల ఫారం నిర్వాహకులు కనీస భద్రత చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అనారోగ్యంతో మరణించిన కోళ్లను సైతం పూడ్చకుండా సమీపంలోని చెరువులో పడేయడంతో పశువులు సైతం అనారోగ్యం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థాలు, దుర్వాసన కారణంగా బావులు, బోర్లు కలుషితమవుతున్నాయన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కోళ్ల ఫారాన్ని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బొడ్డు ప్రకాష్, కునిగంటి కనకరాజు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్టీసీ కాంప్లెక్స్ భవనం



శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మిగిలిన పరవాడ ఆర్టీసీ కాంప్లెక్స్ భవనం

పరవాడ: ప్రయాణికుల సౌకర్యార్థం 20 ఏళ్ల కిందట పరవాడలో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ భవనం నిరుపయోగంగా మారి.. శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. అనకాపల్లి, గాజువాక పట్టణ ప్రాంతాల నుంచి పరవాడ పరిసర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సుల హాల్ట్ కోసం ఇక్కడ సుమారు రూ.10 లక్షలతో ప్రభుత్వం కాంప్లెక్స్ భవనం నిర్మించింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడమే తప్పా ఇక్కడ ఎప్పుడు బస్సులు ఆగిన పాపాన పోలేదు. అప్పట్లో నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని స్థానికులు ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకొని కొంత కాలం వివిధ వ్యాపారాలు సాగించారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో భవనాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. నాటి నుంచి నేటి వరకు ఈ భవనాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో గోడలకు పగుళ్లు ఏర్పడి, శ్లాబ్ పెచ్చులూడిపోవడంతో ఏ మాత్రం వర్షం కురిసినా కారిపోతోంది. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని స్థానిక టీ, టిఫిన్ హోటళ్ల వ్యాపారులు తమ వంట సామగ్రి, ఇతర వస్తు సామగ్రిని భద్రపర్చుకోవడానికి వినియోగిస్తున్నారు. పూర్తిగా పాడైన ఈ భవనాన్ని తొలగించి ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం ద్వారా పంచాయతీకి కొంత ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయని పలువురు స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంచిగా నడుచుకోండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: రౌడీ షీటర్లు బుద్ధి మార్చుకుని ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని సీఐ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవుల మృతి



ఘటనా స్థలిలో మరణించిన ఆవులు

మల్కాపురం: సర్వీస్ రోడ్డులో తెగిపడ్డ విద్యుత్ వైర్ కారణంగా రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. వివరాలు.. 58వ వార్డు ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్ మీదుగా మారుతి సర్కిల్‌కు వెళ్లే మార్గంలో కొన్ని రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో మారుతి సర్కిల్‌కు వచ్చే వాహనాలను దారి మళ్లించారు. దారి మళ్లించిన మార్గంలో నేలపై విద్యుత్ వైర్ పడి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు నేల నాని ఉంది. శనివారం అర్ధరాత్రి విద్యుత్ వైర్ పడి ఉన్న మార్గాన సంచరిస్తున్న ఆవులు, ఆ వైర్‌కు సమీపం నుంచి వెళ్తూ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఉదయం ఆ మార్గాన వచ్చే వాహనదారులు చచ్చి పడి ఉన్న ఆవులను చూసి, పరిశీలించగా, అక్కడ తెగిపడ్డ విద్యుత్ వైర్‌ను గుర్తించారు. కరెంట్ షాక్‌తో ఆవులు మృతి చెందాయని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలో మనుషులు సంచరిస్తే వారి పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

'అంకెల మామయ్య'.. భలే శిక్షణ ఇచ్చాడు..



వర్క్‌షాప్‌లో పాల్గొన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చంద్రయ్య

మద్దిలపాలెం: పిల్లలను మొబైల్ ఫోన్‌ల వ్యసనం నుంచి దూరం చేసి, వారిలో సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంచే లక్ష్యంతో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీపాలెంలో ఆదివారం ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్ నిర్వహించారు. 'మొబైల్ డి-అడిక్షన్, ఫన్ మ్యాథ్స్, చిట్టి ప్రయోగాలు' అనే ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్, 'అంకెల మామయ్య' చంద్రయ్య శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా చంద్రయ్య సైన్స్ సూత్రాలను చిన్న చిన్న ప్రయోగాల ద్వారా చిన్నారులకు అర్థమయ్యే విధంగా వివరించారు. హిప్నోటిక్ స్ట్రా, ఎగిరే స్ట్రా, తిరుగుతున్న స్ట్రా, మ్యాచ్ బాక్స్ రైలు, విధేయుడైన అగ్గిపెట్టె, సింపుల్ యానిమేషన్, పేపర్ విజిల్, అరచేతిలో మ్యాజిక్ వంటి ఆసక్తికరమైన అంశాలతో పిల్లలు ప్రయోగాలు చేసి నేర్చుకున్నారు. మరోవైపు గణితంలో సరదా అంశాలైన తప్పిపోయిన అంకె, పుట్టినరోజు తర్కం, వయస్సు రహస్యం, స్పెల్లింగ్ లాజిక్ వంటివాటిని చెప్పించారు. ఈ కార్యకలాపాల ద్వారా పిల్లలు కేవలం సమయాన్ని గడపడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలు సులువుగా తెలుసుకుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల ద్వారా పిల్లల్లో శ్రద్ధ, మెరుగైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, విమర్శనాత్మక ఆలోచన పెరుగుతాయని చంద్రయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కాయిన్ మ్యాజిక్ కాజా కూడా పాల్గొనగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

15న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం: ఈ నెల 15న సబ్బవరం సెక్షన్–1 కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఈ రామకృష్ణ, సీజీఆర్ఎస్ చైర్మన్ డాక్టర్ బి.సత్యానారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సురేఖరాణి, సభ్యులు ఎన్.మురళీకృష్ణ, ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొంటారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పబ్లిక్ లైబ్రరీ, విద్యాభవన్స్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ పిల్లలను ఉత్సాహపర్చింది. కథాకారిణి ఎం.సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో చమత్కారం, తెలివితో ప్రత్యేకత సాధించిన ఒక చిన్న ఉల్లాస భరితమైన టైలర్ బర్డ్ కథను ఎంతో ఆసక్తికరంగా వివరించారు. కథ వినడమే కాకుండా వర్క్‌షాప్‌లో పిల్లలు పాటలు పాడి, పక్షులు కట్టి వివిధ రకాల గూళ్లు పరిశీలించి కొత్త విషయాలు నేర్చుకున్నారు.